బసవలింగ పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూరు, మే 19: నేరెడుగం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త, యువకుడు బోయ బసవలింగ ట్రాక్టర్‌తో చెరువుకట్టపై వస్తుండగా అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటకలోని పెద్దసంబరం గ్రామ శివారులో శనివారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నేరడగం గ్రామానికి వెళ్లి బసవలింగ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తల్లి బోయ వెంకటమ్మకు ఒక్కగానొక్క కొడుకు కావడంతో ఆమె కన్నీరుమున్నిరైంది. ఆమెతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ప్రతి అథ్లెట్ చాంపియన్‌గా ఎదగాలి

- గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్

క్రీడాసామగ్రిని అందజేస్తున్న రజినీసాయిచంద్

జడ్చర్లటౌన్, మే 19: ప్రతి ఒక్క అథ్లెట్ ఓ చాంపియన్‌గా ఎదగాలని గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజినీసాయిచంద్ అన్నారు. జడ్చర్లలోని మినీస్టేడియం మైదానంలో లక్ష్యా అథ్లెటిక్స్ ఆధ్వర్యంలోఆదివారం స్థానిక వ్యాపారి రాంరెడ్డి సౌజన్యంతో క్రీడాకారులకు క్రీడాసామగ్రి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులకు మొదటి అడుగు కష్టంగానే ఉన్నా.. పట్టుదలతో రాణిస్తే విజయం దిశగా ముందుకెళ్తారన్నారు. ఆడపిల్లలు ఆటల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. క్రీడాపోటీల్లో రాణించిన క్రీడాకారులకు తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కోచ్ శ్రీనివాస్‌ను ఆమె అభినందించారు.

జాతీయస్థాయి పరుగుపోటీలో గోల్డ్‌మెడల్

గోల్డ్‌మెడల్ సాధించిన తరుణ్

గండీడ్, మే 19: జాతీయ స్థాయి పరుగుపోటీలో మండల పరిధిలోని మన్సూర్‌పల్లి తండాకు చెందిన కేతవత్ తరుణ్ బంగారు పతకం గెలుపొందారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, స్నేహితులు అతన్ని అభినందించారు. ఢిల్లీలో ఫిట్ ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి 800మీటర్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు స్నేహితుల ద్వారా తెలుసుకుని పాల్గొన్నాడు. మే 18 నుంచి 21వరకు జరిగే ఈ పోటీల్లో దేశంలో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అగ్నిగుండం

అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

నవాబ్‌పేట, మే 19: మండలంలోని లోకిరేవులో వీరభద్రస్వామి స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం అగ్నిగుండం, స్వామివారి కల్యాణోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. పలువురు భక్తులు అగ్నిగుండం నిప్పుల్లో నడిచారు. ఉత్సవాలను తిలకించేందుకు వివిధ గ్రామాల భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సత్యం, వెంకటేశ్, ఆలయ ప్రధాన అర్చకులు లింగయ్యస్వామి, నాయకులు నర్సింహాచారి గోపాల్‌గౌడ్ ఉన్నారు.

ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

అధికారులు స్వాధీనం చేసుకున్న బెల్లం, డీసీఎం

లింగాల, మే 19: డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకున్నది. తెల్కపల్లి ఎక్సైజ్ ఎస్సై జనార్దన్ కథనం మేరకు టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని శాయిన్‌పేట గ్రామంలో గస్తీ నిర్వహిస్తుండగా జీలుగుపల్లి గ్రామానికి చెందిన జూలురి ప్రసాద్,శాయిన్‌పేటకు చెందిన పిట్టల వెంకటస్వామి డీసీఎం వ్యాన్‌లో 6క్వింటాళ్ల 270కిలోలు (209 బస్తాలు) నల్లబెల్లం , 50కిలోల పట్టిక తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. బెల్లంతో పాటు డీసీఎం వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే సారా బట్టీలపై దాడులు నిర్వహించి 10లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో సీఐ బాలరాజు, ఎస్సై రమణయ్య, సిబ్బంది అరుణ్, యాదగిరి, కృష్ణ, శంకర్, ముజాఫర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

నిద్దరోతున్న నిఘానేత్రం

మాగనూరు వద్ద పోలీస్‌స్టేషన్‌లో మాత్రమే పనిచేస్తున్న సీసీ కెమెరాలు

- జాతీయ రహదారిపై నిరుపయోగంగా పదికి పైగా సీసీ కెమెరాలు
- ప్రమాదాలు, చోరీ కేసుల్లో పురోగతిపై దృష్టి పెట్టని పోలీసులు

మాగనూర్ జాతీయ రాహదారిపై నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

మాగనూరు, మే 19: మండల కేంద్రంలోనీ వ్యాపారస్తుల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై మండల కేంద్రం నుంచి నల్లగట్టు మారెమ్మ ఆలయం వరకు ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాల్లో ఒక్కటి కూడా పనిచేయడం లేదని మాగనూరు గ్రామస్తులు తెలిపారు. చోరీలు, ఇతర నేరాలను స్థానికంగా అరికట్టేందుకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పి, గతంలో మాగనూరులో పనిచేసిన ఎస్సై నరేందర్ గ్రామంలోని వ్యాపారస్తులు, గ్రామస్తుల సహకారంతో వాటిని ఏర్పాటు చేయించారు. కానీ ప్రస్తుతం పోలీస్ స్టేషన్ ఆవరణలో మాత్రమే సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయని, మిగతా వాటి మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. కర్ణాటక, తెలంగాణ అంతర్రాష్ట్ర రహదారి ఉండడం వల్ల జాతీయ రహదారిపై ప్రమాదాలు, చోరీలు వంటివి చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. నల్లగట్టు మారెమ్మ ఆలయం జాతీయ రహదారికి అనుకొని ఉండడంతో ప్రతి మంగళవారం భక్తులు, వ్యాపారస్తులు వేలమంది రోడ్డు పక్కనే వ్యాపారాలు చేసుకుంటారని, వీరితో పాటు స్థానికులకు ఎంతో ఉపయోగపడే సీసీ కెమెరాలను ఉపయోగంలోకి తేవాలని పోలీసులను కోరుతున్నారు.

మందులు అందజేత

మూసాపేట, మే 19 : మూసాపేట మండల కేంద్రానికి చెందిన మొఖ్తదీర్‌బాబాకు ఐదు నెలల కిందట పక్షవాతం వచ్చి మంచం పట్టాడు. అతడి ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో లావణ్య ఆయుర్వేదిక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రూ.12,500 విలువగల మందులను డాక్టర్ లావణ్య ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి నెలా రూ.12,500 మందులు అవసరమని ఆమె తెలిపారు. రెండు నెలలుగా మందులు అందజేసినందుకు ఆమెను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రామన్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శెట్టి శేఖర్, ఎంపీటీసీ గోవర్ధన్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, తిరుపతయ్యగౌడ్, మహేందర్, నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 19: కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ ఆదివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కులాల వారీగా జనాభా లెక్కలు తీసి బీసీ రిజర్వేషన్లు 40శాతం పెంచుతామని, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ మేరకే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

ఆర్ఎంపీ వైద్యుడి ఆత్మహత్య

మల్లేశ్‌నాయక్ (ఫైల్)

భూత్పూర్, మే 19 : కుటుంబ కలహాలతో ఆర్ఎంపీ వైద్యుడు ఆత్మహత్యకు పాల్పడి నఘటన మండలంలోని పెద్దతండా గ్రామ పంచాయతీ పరిధిలోని భగవాన్‌తండాలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి ఎస్సై శ్రీనివాసులు కథనం ప్రకారం.. భగవాన్‌తండాకు చెందిన కేతావత్ మల్లేశ్‌నాయక్(26)కు హైదరాబాద్‌లోని గాజుల రామారంలో నాలుగేండ్లుగా ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. తిమ్మాజిపేట మండలం ఆర్‌సీ తండాకు చెందిన శిరీషతో ఏడాది కిందట వివాహమైంది. భార్యాభర్తలు ఇద్దరూ హైదరాబాద్‌లోని గాజుల రామారంలోనే నివాసముంటున్నారు. కాగా, భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే శుక్రవారం భగవాన్‌తండాకు వచ్చి మళ్లీ గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన మల్లేశ్‌నాయక్ శనివారం రాత్రి గుర్తుతెలియని మందుతో ఇంజక్షన్ చేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కేతావత్ తావుర్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టీస్టాల్‌ను ఢీ కొట్టిన కారు

- తప్పిన పెనుప్రమాదం

వెల్దండ, మే 19 : మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై అంబేద్కర్ చౌరస్తాలో టీస్టాల్‌ను కారు అదుపుతప్పి ఢీకొన్న ఘటన చోటు చేసుకున్నది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఆదివారం హైదరాబాద్ వైపు నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న వాహనం ముందర మరో వాహనాన్ని తప్పించబోయి అక్కడే ఉన్న టీస్టాల్‌ను కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కూర్చున్న ఓవ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. యజమానితోపాటు వాహనంలో ఉన్న వ్యక్తులు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు.

నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఈవీఎం స్ట్రాంగ్ రూం వద్ద కలెక్టర్ రవినాయక్

- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 19: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. ఆదివారం పాలమూరు యూనివర్సిటీలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద పోలీస్ భద్రత, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికల బ్యాలెట్ బాక్సులను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు.

నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే చర్యలు

ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగేశ్‌కుమార్

మాగనూర్/మక్తల్ టౌన్, మే 19: రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ నాగేశ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మక్తల్‌లో మండల వ్యవసాయ అధికారి మిథున్ చక్రవర్తి, మాగనూర్ మండలంలో మాగనూర్,కృష్ణ ఉమ్మడి మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ ఏడీఏ నాగేశ్‌కుమార్ వడ్వాట్‌లోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో ఎరువుల దుకాణ యజమానులు, బయటి వ్యక్తులు రైతులను మోసం చేసేందుకు నకిలీ విత్తనాలను సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దళారుల వద్ద కొనుగోలు చేయకుండా ప్రభుత్వం కేటాయించిన విత్తనాలు కొనాలని సూచించారు.

వెట్టిచాకిరీ విముక్తికి సుందరయ్య పోరాటం

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి

నారాయణపేట, మే 19: భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరీ నుంచి విముక్తికై తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన గొప్ప నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ఎంతో సాధారణమైన జీవితం గడిపారని, పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దాదాపు పదిలక్షల ఎకరాల భూమిని పేదప్రజలకు పంచిపెట్టారన్నారు. స్వతంత్ర్య భారత దేశంలో పార్లమెంట్‌లో మొదటి ప్రతిపక్ష నేత అని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, బాల్‌రాం, జిల్లా నాయకులు కాశప్ప, శివకుమార్, హనుమంతు, శంకర్, కృష్ణయ్య, సత్యప్ప, మాణిక్యం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాలమూరు, మే 19: జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ హై స్కూల్‌లో ఆదివారం 2004-05వ సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాసిత్, 2004-05వ బ్యాచ్ ఉపాధ్యాయులు కిషన్ గౌడ్, రవీందర్‌గౌడ్, ఆశీర్వాదం, మాణిక్యప్రభు, గోపాల్, అబ్దుల్‌నబీ, పెర్సిస్, డేబోరాలతో కలిసి పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా తరలివచ్చి కలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మూసాపేట, మే 19 : జానంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ కోతలు ఉంటాయని, ప్రజలు సహకరించాలని ట్రాన్స్‌కో ఏఈ వెంకటయ్య ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. 33 కేవీ ఫీడర్, 11కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 7నుంచి 11గంటల వరకు జానంపేట, నిజాలాపూర్, వేముల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

సుకన్య సమృద్ధి పథకం పత్రాలు అందచేస్తున్న స్నేహితులు

దేవరకద్ర, మే 19 : మండలంలోని గద్దెగూడెం గ్రామానికి చెందిన చెన్నరాయుడు గతేడాది డిసెంబర్ 21 అనారోగ్యంతో మృతిచెందాడు. దేవరకద్ర ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1997-1998 సంవత్సరంలో పదో తరగతి చదివాడు. దీంతో అతడి స్నేహితులు ఆదివారం చెన్నరాయుడు ఇంటికి వెళ్లి ఇద్దరు కూతుర్ల పేరిట చెరో రూ.50వేల చొప్పున ప్రధాన మంత్రి సుకన్య పథకం కింద డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలను స్నేహితుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో కిశోర్, హరికాంత్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మూసాపేట(అడ్డాకుల), మే 19 : అడ్డాకుల మండలంలోని కాటవరం జాతీయ రహదారిపై వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన చోటుచేసుకున్నది. ఎస్సై శ్రీనివాసులు కథనం ప్రకారం.. మండలంలోని కాటవరం స్టేజీ వద్ద ఆదివారం రోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడికి 30ఏండ్లు ఉంటాయని, జీన్స్ ప్యాంటు, డబ్బాల లైన్ చొక్కా కలిగినట్లు తెలిపారు.

ప్రవచన కార్యక్రమ కరపత్రం విడుదల

జడ్చర్ల, మే 19: జడ్చర్లలోని చంద్రాగార్డెన్స్‌లో జూన్ 1న నిర్వహించే సామవేదం షణ్ముఖ శర్మ ప్రవన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో జనార్దన్, విజయకుమార్, వేణుగోపాల్, విఠలయ్య, మహేశ్వర్, శంకర్‌బాబు, విశ్వనాథం, గోపాలకృష్ణ ఉన్నారు.

'దళారుల వద్ద విత్తనాలు కొనొద్దు'

కృష్ణ, మే 19 : మండలంలో పత్తి సాగు చేసే రైతులు పత్తి విత్తనాలను దళారుల వద్ద కొనుగోలు చేయవద్దని ఎస్సై నవీద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు వేరే ప్రాంతం నుంచి వచ్చి గ్రామాల్లో రైతులకు అధిక దిగుబడి వస్తుందని ఆశ చూపి, నాసిరకం పత్తి విత్తనాలు విక్రయిస్తున్నారని తెలిపారు. అలాంటి వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కేవలం లైసెన్స్ ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని, రసీదు తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు.

శ్మశాన వాటికకు రోడ్డు వేసుకున్న గ్రామస్తులు

కృష్ణ, మే 19 :మండలంలోని గుడెబల్లూర్ ఆదివారం గ్రామస్తులు సొంత ఖర్చుతో శ్మశాన వాటికకు రోడ్డు వేసుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసినా పట్టించుకోకపోవడంతో, తామే చందాలు వేసుకుని రోడ్డు నిర్మించుకున్నామని గ్రామస్తులు తెలిపారు.

లయన్స్ క్లబ్ టౌన్ కార్యవర్గం ఏకగ్రీవం

నారాయణపేట టౌన్, మే 19: లయన్స్ క్లబ్ నారాయణపేట టౌన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా రఘుబాబు, కార్యదర్శిగా మహేశ్‌గౌడ్, కోశాధికారిగా సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ కృపాకర్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు సంపత్‌కుమార్ ధరక్, సీనియర్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, రవికాంత్, మధుసూదన్‌రెడ్డి, సభ్యులు వెంకటేశ్, రాముసింగ్, రామాంజనేయులు, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డుపై మాంసం విక్రయాలు చేపట్టొద్దు

మాంసం విక్రయాలు నిలిపివేయాలని కోరుతున్న యువకులు

ఊట్కూర్, మే 19 : మండల కేంద్రంలోని మొగ్దుంపూర్ చౌరస్తాలో రోడ్డు పక్కన మాంసం విక్రయాలను వెంటనే నిలిపివేయాలని మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణయ్యగౌడ్, లాల్‌బహద్దూర్ హనుమాన్ జాతరోత్సవ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం చౌరస్తాలో మాంసం విక్రయాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఈనెల 22, 23న హనుమాన్ జాతర ఉత్సవాలు ఉన్నందున చౌరస్తాలో జరిగే మాంసం విక్రయాలతో భక్తులకు అసౌకర్యం ఏర్పడుతుందన్నారు. అధికారులు స్పందించి మాంసం దుకాణాలను తొలగించేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్, నాగేశ్, వెంకటప్ప పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

బిజ్వారం-అవుసలోనిపల్లి మధ్య అధ్వానంగా ఉన్న బీటీ రోడ్డు

ఊట్కూర్, మే 19: మండలంలోని బిజ్వారం నుంచి అవుసలోనిపల్లికి వెళ్లే మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు గుంతలమయం కావడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదే విషయమై తెలంగాణ విద్యావంతుల వేదిక ఉమ్మడి జిల్లా సమన్వయ కర్త బిజ్వారం మహేశ్‌గౌడ్ ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. కొన్నాళ్లుగా బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతు చేపట్టాలని ప్రజల పక్షాన డిమాండ్ చేశారు.

రూ.2,530 ధర పలికిన ఆర్ఎన్ఆర్ ధాన్యం

నవాబ్‌పేట, మే 19: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం ఆర్ఎన్ఆర్ ధాన్యం క్వింటా గరిష్ఠంగా రూ.2,530 ధర లభించినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తెలిపారు. నవాబ్‌పేట మార్కెట్‌కు ఆదివారం రికార్డుస్థాయిలో ఆర్ఎన్ఆర్ వరి ధాన్యం 27,753 బ్యాగులు వచ్చిందని, అలాగే హంస దొడ్డురకం ధాన్యానికి గరిష్ఠంగా క్వింటా రూ.2,083 ధర లభించిందని తెలిపారు. సమయానికి టెండర్లు వేసి ధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.